"దేవుని ఎదుట నిలిచి సత్యమే చెబుతాను. అబద్ధం చెప్పను" అని చెప్పసాగింది.

"నాభర్త హత్య చెయ్యబడ్డ సమయంలో ఈ నా కొడుకు తన గదిలో నిద్రపోతున్నాడు. నా ఏడ్పు విన్నతర్వాతనే ఇతను తన గదిలోంచి లేచి వొచ్చాడు. హంతకుడు వేరే ఎవరో అయివుండాలి. నా కొడుకు మాత్రం నిర్దోషి."

ఇంత బలమైన సాక్ష్యం అతను దోషి కాదన్నప్పుడు, తక్కిన సాక్ష్యాలు పని చెయ్యలేదు. అందుకని కేసు కొట్టివేయబడింది.

రామాన్ని విడుదలచేశారు. అతను ఒక్కపరుగున సవతితల్లిని సమీపించాడు. క్షమించమని వేడుకున్నాడు. ఇంత కాఠిన్యం గల ఆవిడ హృదయం అలా ఎందుకు పరివర్తన చెందిందో అతనికి మాత్రం తెలియలేదు.

ఇంటికివొచ్చాక ఇంటి పెత్తనం అంతా తల్లికే అప్పగించి "నీ యిష్టమొచ్చినట్టు సంసారాన్ని సాగించు. మేమందరం నీచెప్పు చేతల్లో వుంటాం" అన్నాడు రామం.

ఆవిడ ముందర వొద్దన్నా అతను మనస్ఫూర్తిగా ఇస్తున్న గౌరవాన్ని స్వీకరించింది. నెమ్మదిగా సూర్యకాంతం కూడా ఇంటిపనులు నేర్చుకుని అత్తగారి ప్రేమకి పాత్రురాలవసాగింది.

అప్పుడప్పుడు రమణమ్మగారు రామం వినయ విధేయతల్ని చూసి అనుకుంటుంది: "ఏవో దుర్భర పరిస్థితులవల్ల హంతకులుగాను, దుర్మార్గులుగాను మారినవారిని ఉరితీయడమో, నిర్బంధించడమో చేస్తారుగాని, వాళ్ళని సమాజంలో బతకనిచ్చి వాళ్లు చేసిన నేరానికి పశ్చాత్తాపం పొందేలా చేసే అవకాశాన్నివ్వడం అన్నిటికంటె గొప్ప శిక్షగావును" అని.

ఇప్పుడు రమణమ్మగారు రామానికి సవతి తల్లి కాదు-రెండో జన్మ నిచ్చిన తల్లి.

స్కెచ్

# ఆదర్శాల అన్వేషణ

"శ్రీ విరించి"

ఈ కథ రాయటమే అసలు అనవసరం. రాసినా పాత్రలకు పేర్లు పెట్టటం మరీ అనవసరం. అయినా ఒక తప్పెలాగూ చేస్తున్నాను గనుక రెండోదానికోసం అంత భయపడనక్కర్లేదు. రోటిలో తలదూర్చి రోకటి పోటులకు వెఱవటం ఎందుకు? సరే కానివ్వండి! జరగాల్సిందేదో జరిగే తీరుతుంది. ఎవడి కర్మకో నేను వెఱవాల్సిన అవసరం?

సీతారామయ్య నామాట కాదని, నాలుగెకరాల పొలమూ అమ్ముకుని, ఆ వెనక బస్తీ చేరుకున్నాడు. శుభ్రమయిన గదొకటి తీసుకుని అందులో వుంటున్నాడు. బస్తీలో తెలిసో తెలియకో యిబ్బందిపడాల్సిన అవసరం తప్పిపోతూ వచ్చింది, చేతినిండా డబ్బుండటంవలన. వాడు తను వొచ్చిన పనేదో చూచుకొంటూ, గుట్టుగా బతికితే యీ కథే లేకపోవును. కాని అట్లా జరగక పోవటంవల్లే!

తన కాగది అద్దెకు యిచ్చిన విచిత్రవ్యక్తి భూషణం పోకడలు గమనిస్తూవచ్చాడు. ఆ భూషణం అనే ఆయనకు యిక్కడే యిల్లేగాక మరో దిక్కుగా రెండుమేడలు వున్నాయనీ, ధనాశేగాక స్థలవిస్తీర్ణాన్నిబట్టి వాటిని ఎవరెవరికో అద్దెలకిచ్చేసి యీ డాబాలో ముందుగదిని వీడికిచ్చి మిగతా నాలుగు గదుల్లోనూ భార్యాసమేతుడై కాపురం చేస్తోన్నాడనీ, వీరిద్దరికీ ఒక కొడుకువున్నా అతనెప్పుడూ పట్నంనుంచీ దిగిరాడనీ తెల్సుకోడానికి సీతారామయ్యకే గాదు, దారిన బోయేవాడి కెవరి

కయినా ఎక్కువకాలం పట్టదు. ఎంచేతంటే భూషణంగారి కీర్తి కొంత అట్లాంటిది!

మొట్టమొదట్నించీ వున్న జబ్బేగా మా సీతాయిగాడికీ, వీడు ఆ భూషణం అంటేనే మండిపడటం మొదలెట్టాడు. ఆయన వ్యతిరేకులదగ్గిర చేరి వాళ్ళ క్రోధాగ్నులకు ఆజ్యజని ఊదాడు. తనెంత, తన తాహతెంత భూషణం ముందు? అదేమన్నా ఊహించుకొన్నాడా? నిజమంటే నిష్ఠూరం, ఈ మాటకు నామీదే విరుచుకుపడ్డారు మావూళ్ళో వాళ్ళంతా ఆ సీతారామయ్య అంటే నేను కళ్ళల్లో నిప్పులోసుకుంటానని.

మనిషికి ప్రవర్తనే ముఖ్యం అన్నాడు. ఆ భూషణంగారు భార్యను నానా హింసలూ పెడుతో, రోజుకో వారకాంతను తెచ్చుకొని, అనుభవిస్తోన్నాడనీ సుఖపడుతోన్నాడనీ వీడికి మహా కన్నెర్ర. భార్యకు దాంపత్యసుఖం లేకండా చేస్తోన్నాట్ట! అయినా వాళ్ళకే మంగమ్మశపథం లాంటి దేముందో, వాళ్ళ పుట్టుపూర్వోత్తరాలు తనకేమయినా తెలిసేడ్చునా? ఎందుకొచ్చిన రగడ! అన్ని యిళ్ళుగలవాడి మీదా, అంత డబ్బుగలవాడిమీదా, విప్లవం లేవదీస్తానన్నాడు. అదేం చిత్రమో ఆ భూషణం మేడల్లో కాపురాలు చేస్తున్న వాళ్ళంతా వీడికి కావల్సినంత అండ యిచ్చారు. వీడికి దొరికినంత అండ, సహాయ సంపత్తి ప్రకాశం గారికూడా దొరకలేదు! చిత్రం! ఈ విషయం తనేం గొప్ప డిస్కవరీ చేసినట్టుగా నలుగుర్లోనూ వెళ్ళబెట్టాలా? అందరికీ తెలిసేవుండెను! కానీ ప్రచారమే చేశాడు. ఏమన్నా ఫలం దక్కిందా? "డబ్బున్నవాడు ఆయనేం చేసినా ఫరవాలేదు. నువ్వు డబ్బులేనివాడవు గనక యేమీ అనగూడదు" అన్నారు అంతా. అవును, నాలుగెకరాలు అమ్మగా వచ్చిన డబ్బయినా, ఎన్నాళ్ళొస్తుంది ఆ వరస ఖర్చుచేస్తోంటే? ఇంత పరాభవమూ అయినా, వొదిలిపెట్టాడుగాదు చర్చలు. నలుగురూ దాన్ని 'కార్యదీక్ష' అన్నారు. వుంటారుగా గుడ్డిసంకలు. ఎంతో గొప్ప రహస్యాలే దాగనప్పుడు యీ పేలుడు కాయనోటిమాటలు ఎక్కడ దాగగలవు? ఆ మాట భూషణం దగ్గిరికీ వెళ్ళింది! ఆయన శాంత స్వభావం గలవాడు సహజంగా. ఎంతయినా, తన యింటోవుంటూ- పోనీ, అద్దెకయితే మాత్రం? తన ముడ్డికే ఎసరు తెస్తోంటే చూస్తూ చూస్తూ ఎట్లా వూరుకోగలడు? మళ్ళీ నెల అద్దె వసూలు చేసుకునేటప్పుడు ఇద్దరికీ ఘర్షణ జరగనే జరిగింది, ఆయన్ను గురించి విషప్రచారం చేస్తేచేశాడు- ఆయన మొహానే అనేయ్యాలా ఆ నాలుగు ముక్కలూ బొత్తిగా తాలిమి లేకుండా?

"నా యిష్టం. ఇది నాయిల్లు. నువ్వెవరు?" అన్నాడాయన. అంటాడు. అవును. అనడూ?

"ఎంత మీ ఇల్లయినా, సంఘానికి కట్టుబడుండాలి. మానవత్వం పూర్తిగా అణగారిపోకూడదు" అన్నాడు తనో గొప్ప వేదాంతిలాగ!

భూషణం తను వినియోగించ గలంత శాంతమూ వినియోగించి, "అబ్బాయీ, చిన్నవాడివి. నీకెందుకీ విషయాలు. జాగ్రత్తగా గదిలోవుంటో... నీపని నువ్వు చూచుకో... మితిమీరకు..." అని మందలించాడు!

"నా కళ్ళముందే యింతటి దురాచారం జరుగుతూంటే ఎట్లా చూస్తో వూరుకోగలను?" అన్నాడు వీడు పెడకట్టెగా!

"వూరుకో లేకపోతే గది కాళీ చేసి వెళ్ళిపో." అన్నాడాయన. ఇంకా నయం వురెట్టుకోమన్నాడుగాదు!

గది కాళీచేయటం విషయం వచ్చేసరికి, సీతారామయ్య గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్టుగా అయింది! ఈ బస్తీలో... మరో గది దొరకదు. అయినా, ప్రయత్నిస్తే దొరకొచ్చుం. దొరికినా, ఇక అతని దురాచారం మాన్పించటం ఎట్లా సాధ్యం? కనక, గదివదిలేమాట వట్టిది! అంతదాకా రాకుండానే వ్యవహారం ఫైసలు చేయాలి! గత్యంతరంలేక అట్లా కనిపించటానికి యిష్టంలేకే, సీతారామయ్య మరి మాటాడలేదు. రూపాయిల నోట్లు కోటు జేబులోకి నెట్టుకుంటూ, సీతారామయ్యవైపు 'పరాక్' అన్నట్లుగా చూచాడు భూషణం, వెళ్ళిపోతూనే! ఆ సంఘటన జరిగిన తర్వాత, భూషణం వీణ్ణో కంట కనిపెడుతోనే వున్నాడు ఎందుకైనా మంచిదని!

వీథిలోవాడు వీథిలోనేపోతే సరిపోయేది. వీడు భూషణంభార్య అనుగ్రహం సంపాయించటానికి ప్రయత్నించాడు. ఆవిడ, తనకు మగజాతి అంటే యింతవరకూ కరుడుగట్టుకుని వున్న ద్వేషాన్ని కనుపరుస్తో 'నీకు నాతో పనేమి'టని వీణ్ణి తిట్టేదాకా వొచ్చి ఇంట్లోకి వెళ్ళిపోయింది. ఈ విషయాన్ని గురించి మాట్లాడుతూ, సీతారామయ్య తనకు భృత్యానుభృత్యులుగా పనిచేస్తోన్న మిత్రుల్తో చిన్న వుపన్యాసంలాంటిది దంచాడు.

"మనదేశంలో స్త్రీలకు వున్న జ్ఞానం బహు తక్కువ. మనం సిగ్గుపడవలసినంత తక్కువ. ఎంత తెలివితక్కువదయితే ఆ సుందరమ్మగారు నన్ను తిట్టేదాకా వొచ్చింది? ఇంకా, ఆడవాళ్లు పరాయి మగవాళ్లతో మాట్లాట్టానికి జంకుతోన్నారంటే మన దౌర్భాగ్య స్థితిని వర్ణించక్కర్లేకుండానే తెలుసుకోవచ్చును! మనలాంటి యువకులు 'దీక్షతో' సమాజ్యవస్థను మార్చటానికి శక్తివంచన లేకుండా పనిచేయాలి. అప్పుడుగాని మన విద్యుక్త ధర్మాన్ని నెరవేర్చిన వాళ్ళం గాము..."అట్లా అని!

భూషణం దగ్గిరా, సుందరమ్మగారిదగ్గిరా తన కబుర్లు పనిచేయనప్పుడు - గొప్ప తెలివిగా, భూషణం చేరదీసే వాళ్ళదగ్గిర చేరాడు. దేశమంతటా యిట్లాంటి ఆరాచకపుచేష్టలు పోతేనే గాని శ్రేయస్సు గలగదన్నాడు. డబ్బుకోసం 'అవినీతి'పన్లు చేయటం మంచిపని గాదన్నాడు. వాళ్ళ ప్రశ్నలకు సమాధానాలు తెలివిగా చెప్పి గొప్పవాణ్ణనిపించుకోవాలనిబోయి, దెబ్బ తిన్నాడు.

"మరి ఇది మా వృత్తిగదా!" అన్నదొక వనజ.

"మీ వృత్తి! అసలు వృత్తులెట్లా యేర్పడినై. మనం ఆపని చేస్తూన్నప్పుడు గదా ఆపని మనం వృత్తిగా చెప్పుకుంటున్నాం! అదంతా మన చేతుల్లో వుందిగాని" అన్నాడు.

"మాకు డబ్బెట్లా వొస్తుంది, అంతా పొట్టకోసమే గదా?" అన్న ప్రశ్నకు - "అందరు ఆడవాళ్లూ ఎట్లా బతుకుతున్నారు? వాళ్లలాగ మీరూ పెళ్ళీ పేరంటాలు చేసుకొని, మొగుళ్ల మీద..."

వీడి మాట పూర్తిగాక ముందే వాళ్లంతా పకపకా నవ్వారు, సీతారామయ్య నిశ్చేష్టుడైనాడు. వాళ్లల్లో వొక జాణ "చాల్లేవయ్యా, నేర్చావ్! మా దారిని మమ్మల్ని నడవనీక నీ అడ్డేమిటీ?" అందిట! దెబ్బల దాకా రాక ముందే జాగ్రత్త పడ్డాడు సీతారామయ్య.

మానవుడు పడగలన్నిపాట్లూ పడ్డాడు భూషణంగారిని సన్మార్గంలో పెట్టటాని కన్నట్టుగా! మంచికిపోతే చెడు ఎదురైనట్లు ప్రతిదానికీ ఏదో వో ఆటంకం యేర్పడి, మెడకు తాడులాగా అయ్యేది.

కాగా, యీ ప్రయత్నాల్లో వీడు సభ్యతకోసమనీ, మర్యాదకోసమనీ ఇత్యాది పనులకనీ ఖర్చుచేసిన సొమ్ము, జమను మించిందయింది. డబ్బంతా వొదలగొట్టుకున్న తర్వాత మళ్ళీ ఊరు చేరుకున్నాడు. ఆ చివరినెల అద్దె గట్టటానికీ యేమీ లేకపోగా, భూషణం దయతల్చి వొదిలాడు.

మళ్లీ వూరు చేరుకున్నాక నలుగురూ అడగటం మొదలెట్టారు. బస్తీలో యేం చేస్తుండేవాడివనీ, ఎంత ముల్లె దాచావనీ! వాళ్ళతో యేంచెప్పినా, నామాటవినని యీ గడుగ్గాయి బస్తీలో వెలగబెట్టిన వుద్యోగం నాకు తెలుసు! అది మీ అందరికీ చెబుతూన్నాను. వాడు మాత్రం బస్తీ వదిలి వచ్చిన కారణంగానీ, మళ్లీ వెళ్ళనందుకు కారణంగానీ మరెవరికీ చెప్పలేదు.

ఇంతపనీ జరిగినా, నామాట వినేతాహతు వాడు సంపాయించుకోలేకపోయాడు, భూషణంతో తనమీద చాడీలు చెప్పానసే అనుమానమో, యేమోగాని!

ఇండియా స్వాతంత్ర్యాన్ని పరిశీలించడానికి యిక్కడికి దయచేస్తున్న అనేకమంది విదేశ మేధావులలో ఎవరికయినా అది కనబడితే కాస్త మనకి కూడా చెపితే బాగుండునని ఓ డెమోక్రాటిక్ ఫ్రంట్ నాయకుడి నిట్టూర్పు.